

ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 5 పుష్పం : 8-9 20-11-2003

RAMANA BHASKARA
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 9 ISSUE : 5

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎08814 - 222438, 221260
94401-31188

## లక్ష్యసాధనకు దృఢచిత్తం ప్రధానం

ఒక నిర్ధేశిత గమ్యం, లక్ష్యంలేని జీవితం వ్యర్థం అవుతుంది. మానవజీవిత గమ్యం అహంకారాన్ని అనగా వ్యక్తిభావనను సమూలంగా తొలగించుకోవడం ద్వారా అనంతమైన దివ్యత్వాన్ని, పరమశాంతిని స్వరూపంగా అనుభవంలోనికి తెచ్చుకొనేదిగా వుంది. అదే మోక్షస్థితి. అట్టి లక్ష్యాన్ని నిర్ణయించుకొన్నప్పుడు దాని సాధనకై శ్రద్ధ, దీక్ష, ఓర్పుతో నిరంతరం శ్రమించి, కృషిచేయవలసియున్నది. లక్ష్యము పట్ల, లక్ష్యసాధనకు చేసే సాధనపట్ల ఏకాగ్రత, ప్రేమ, దృఢవిశ్వాసం ఉండాలి. సాధనామార్గంలో అహంకారము, మమకారము, అరిషడ్వర్గాలు ఆటంకాలను కల్పిస్తూ వుంటాయి. భ్రాంతివలన శోఖము, మోహము, భయములకు లోనవుతూ వుంటాము. వివేక వైరాగ్యముల ద్వారా ఈ ఆటంకాలను అధిగమించి, లక్ష్యం వైపు దృష్టి సారించాలి. పవిత్రతను, ఏకాగ్రతను నిరంతరం కాపాడుకొనుటయే బుద్ధిమంతుని లక్షణం. మనోవికారాలను దూరం చేసుకొంటూ, మనస్స నిర్మలం చేసుకోవడానికే సాధన. ధృడము, నిర్మలము అయిన చిత్తము అంతర్ముఖమై ఆత్మాకారము చెందుతుంది. ఎడతెరిపిలేకుండా నిరంతరం స్వరూపచింతన చేస్తూ ఉండటమే సఫలతకు కీలకం. సాధనలో కష్టములు ఎదురవుతూ ఉన్నట్లు కనిపిస్తూ ఉన్నా చివరకు సాధనాఫలం అమృతంలాగ తియ్యగా ఉంటుంది.

**చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

19-10-2003 జిన్నూరు ........ 2
26-10-2003 నరసాపురం ........ 9



Visit us @ www.srinannagaru.com



### సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 19-10-2003, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం జాగ్రత్తగా మంచితనాన్ని పెంచుకొంటూ జీవించాలి, మంచితనం అనే పునాదిలేకుండా ఆత్మజ్ఞానం కలుగదు అని సోక్రటీసు చెప్పాడు. మనస్సుకనుక సమగ్రంగా, సరళంగా లేకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. ప్రతీమనిషి పొట్టకోసం ఏదో కృషిచేసుకొంటున్నాడు, అది దేహగతమైన చరిత్ర, ప్రారబ్దం దేహానికే, ప్రారబ్దం అనుభవించిన వెంటనే ఆదేహం మరణిస్తుంది. ప్రారబ్దం అనుభవిస్తే అది ఖర్చుఅయిపోతుంది. ప్రారబ్దం మంచిగా ఉంటే పొంగిపోతారు, ఆప్రారబ్దం మంచిగా లేకపోతే దుఃఖపడుతూ ఉంటారు, మనకు బేలెన్స్‌లేదు. హృదయాన్ని, బుద్ధిని సమన్వయం చేసుకొంటూ జీవించాలి, అప్పడు ఆమనిషి సమగ్రంగా జీవించగలడు, వాడు ఇహ పరాలలో లాభం పొందుతాడు. ప్రారబ్దం అనుకూలంగా ఉన్నప్పడు పొంగిపోతూ ఉంటే, ప్రారబ్దం అనుకూలంగా లేనప్పడు కృంగిపోతూ ఉంటే మన హృదయంలో ఉన్న నిజానికి మనం దూరమవుతాము. ప్రారబ్దం ఎవరికి అంటే దేహానికే, ఆదేహమే నిజం కానప్పడు ప్రారబ్దం నిజం ఎలా అవుతుంది. కాని మనం దేహం నిజం అనుకోవటం వలన ప్రారబ్దం కూడా నిజం అనుకొని దుఃఖపడుతూ ఉంటాము. ఉన్నది ఒక్కటే, అది మనకు అనుభవంలోనికి వచ్చేవరకు నిజం కానిదానిని నిజం అనుకొంటూ దుఃఖానికి, బాధకు, వేదనకు గురిఅవుతూ ఉంటాము, భగవంతుడు చెప్పినమాటను ప్రమాణంగా తీసుకొని, వేగిరపాటు లేకుండా నిదానంగా జీవించే వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఐశ్వర్యం స్వప్న సమానము, దారిద్ర్యం స్వప్నసమానము. మనకు స్వప్నంలో జరిగే సంఘటనలు ఎంత నిజమో ఐశ్వర్యం, దారిద్ర్యం కూడా అంతే నిజం. సాధ్యమయినంత వరకు జపధ్యానములు విడిచిపెట్టవద్దు. మనం గోదావరినదిలో స్నానం చేస్తున్నాము అనుకోండి. నది వేగంగా ఉన్నప్పడు ప్రక్కన ఏదైనా స్థంభాన్ని పట్టుకొంటాము, లేకపోతే ప్రక్కవారి చెయ్యిపట్టుకొంటాము. ఎందుకు పట్టుకొంటాము? ఆ ప్రవాహంలో కొట్టుకొని పోకుండా ఉండటం కోసం అలా పట్టుకొంటాము. అలాగే ఈ ప్రకృతి ప్రవాహంలో కొట్టుకొనిపోకుండా ఉండటంకోసం ఒకనామాన్ని సపోర్టుగా పట్టుకోండి. భగవంతుని నామాలలో మీకు ఇష్టమైన నామాన్ని జపిస్తూ ఉంటే, ఆయనను ధ్యానిస్తూ ఉంటే ఈ ప్రకృతి ప్రవాహంలో కొట్టుకొనిపోకుండా జపధ్యానములు నిన్ను కాపాడుతాయి. జపధ్యానములు మన మనస్సుకు పవిత్రతను, ఏకాగ్రతను కలుగజేస్తాయి. మనస్సుకు పవిత్రత కలుగుతూ ఉంటే, దానికి ఏకాగ్రత కలుగుతూ ఉంటే అది ఆత్మాకారం చెందుతుంది. మోక్షం గురించి ఊహించుకోవద్దు, అది పొందిన తరువాత మనకు తెలుస్తుంది. మనం కానిదానిలోనుండి విడుదల పొందటమే మోక్షం. మోక్షంలో మీకు పూర్ణశాంతి, పూర్ణఆనందం, పూర్ణసుఖం ఉంటుంది. అందులో వెలితి ఉండదు.

జీవితంలో అన్నీ తలంపులే. కాని మన నిజస్థితి తలంపులులేనిస్థితి. వేకర్, డ్రీమర్, స్లీపర్ ఈమూడుస్థితులు మనం రోజూ అనుభవిస్తున్నాము. ఇప్పుడు మనం జాగ్రదవస్థలో ఉన్నాము, జాగ్రదవస్థలో ఉన్నవాడు వాడి సంస్కారాన్ని బట్టి అలవాట్లనుబట్టి పనిచేస్తూ ఉంటాడు. వాసనలయొక్కవేగం, తలంపులయొక్క వేగం, అలవాట్లయొక్కవేగం ఎక్కువగా ఉంటుంది. అవి మనం అనుకొన్నంత తేలికగా నశించవు, ఎందుచేతనంటే అవి ప్రాచీనకాలం నుండి వస్తున్నాయి. మనకు సాధనాబలం లేకపోతే, ఈశ్వరునిదయలేకపోతే కనీసం సినిమాకు వెళ్ళే చిన్నఅలవాటు నుండి కూడా బయటకురాలేము. వాసనలను తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేస్తున్నాము, ఆప్రయత్నం చేయటానికి మనకు సజ్జనసాంగత్యం ఉండాలి, తపోబలం ఉండాలి, శాస్త్రంయొక్క దయ, గురువుయొక్క దయ ఉండాలి, ఇన్ని రకాలుగా కలిసివస్తే గాని ప్రాచీనకాలంలో నుండి వస్తున్న వాసనల నుండి అలవాట్ల నుండి విడుదలపొందలేము. తలంపులు మేఘాలవంటివి. మేఘాలు అడ్డువస్తే మనకు సూర్యుడు కనబడడు, మనలో ఉన్న తలంపులు మేఘాల క్రింద వచ్చి మన హృదయంలో ఉన్న జ్ఞానసూర్యుడు మనకు అనుభంలోనికి రాకుండా చేస్తున్నాయి. సాధకుడికి కావలసింది వినోదం కాదు, విజ్ఞానం. వినోదం ప్రకృతికి సంబంధించిన విషయం, విజ్ఞానం అనేది హృదయానికి సంబంధించినది. మనలను రక్షించేది విజ్ఞానం. మనం శ్రవణం చేసిన విషయాలను అభ్యాసంచేసి అనుభవంలోనికి తెచ్చుకొంటే అది విజ్ఞానం అవుతుంది. శరీరం మరణించిన తరువాత మనకూడా ప్రయాణంచేసేది మనస్సు. మనం అన్ని రకాలుగా సాధనచేసి మరణానంతరం మనకూడా వచ్చే మనస్సును నిర్మలం చేసుకోవాలి, పవిత్రం చేసుకోవాలి. కాలుజారితే మనం ఏవిధంగా లాక్కొంటామో అలాగే మన మనస్సు ఏవిషయాల వలన బాహ్యాముఖమవుతోందో చూసుకొని, ఆ విషయాలనుండి దానిని విడదీసి, మనస్సునులోపలకు తీసుకొని రావాలి. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. ఆయన మనకు అనుభవంలోనికి వచ్చేవరకు జననమరణ చక్రంలో నుండి విడుదల పొందలేము. సంసారం అంటే కుటుంబ సభ్యులు సంసారంకాదు, అహంకారమే సంసారం. మీకుటుంబంలో ఎవరికైనా మంచి జరిగితే సంతోషం వస్తుంది అదీ అహంకారమే, మీకుటుంబంలో ఎవరైనా చనిపోతే దుఃఖం వస్తుంది అదీ అహంకారమే. అందుచేత అహంకారం ఉన్నంతసేపు సంసారం వస్తూనే ఉంటుంది. అహంభావరహిత స్థితిని పొందేవరకూ చైతన్యస్రవంతిలో ఐక్యంకాలేడు, ఇందులో రాజీపడే సమస్యే లేదు. నీదేహయాత్రకు సరిపడ పనిచేసుకొంటూ మిగతాటైములో ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రయత్నంచేసుకో. ఒక్క ఆత్మజ్ఞానమే నీకు ఆత్మను పట్టిఇస్తుంది. మిగతా విద్యలు అన్నీ లౌకికవిద్యలు, నీమనస్సు ఎంత నిజమో ఆవిద్యలు కూడా అంతే నిజం. భగవంతుడికి అనేక నామాలు ఉన్నాయి, మీకు ఇష్టమైన నామాన్ని స్మరించుకోండి, దానివలన కూడా ప్రకృతి విషయాలనుండి మన మనస్సు





విడుదల పొందుతుంది. మనస్సు అనేది పెద్దమంట, దానిని ఆర్పటానికే జపధ్యానములు, విచారణలు, సత్సంగ సమావేశాలు, ఈజ్ఞానయజ్ఞాలు అందుకే. ధనం యొక్క విలువ తెలిసినవాడు ధనంసంపాదించటానికి ఎలా మార్గాలు అన్వేషిస్తూ ఉంటాడో అలాగే జ్ఞానసముపార్జనకు మనస్సు అక్కడపెట్టి నిరంతరం ప్రయత్నం చేస్తేనే అది వస్తుంది అంతేగాని సోమరితనం వలన అదిరాదు. సాధనలేకుండా సిద్ధికలుగదు. మనకు జయం, అపజయం వస్తూఉంటాయి, సుఖదుఃఖాలు వస్తూఉంటాయి, ఈద్వంద్వాల మధ్యన మన మనస్సును ఎలా సమానంగా ఉంచుకోవాలో శిక్షణ పొందటానికే మనం ఈభూమి మీదకు వచ్చాము, జీవితంలో జరిగే సంఘటనలను బట్టి మనం పాఠాలు నేర్చుకొంటూ మనం బాగుపడటానికి ప్రయత్నంచేయాలి. మీకు అందరికి ఆత్మజ్ఞానం కలుగుతుంది, కంగారుపడవద్దు. కానిమీకు విశ్వాసం ఉండాలి, పట్టుదల ఉండాలి. ఏదో ఉదయం కొద్దిసేపు, సాయంత్రం కొద్దిసేపు నామం చేసుకొంటున్నాము అంటే అలాకుదరదు. మనకు గాఢనిద్రలో తలంపులులేవు. జాగ్రదవస్థ, స్వప్నావస్థలలో తలంపులు ఉంటాయి. ఏ అవస్థలలో తలంపులు ఉంటున్నాయో ఆ అవస్థలలో నామాన్ని విడిచిపెట్టకుండా, నిరంతరం నామం చేసుకొంటూ ఉండాలి. అలా నిరంతరం నామస్మరణ జరుగుతూ ఉంటే రాగద్వేషముల నుండి, కామక్రోధముల నుండి విడుదల పొందగలము. నాకు నెగిటివ్ ఫీలింగ్స్ లేవు అని చెప్పటంకాదు, పాజిటివ్ఫీలింగ్స్‌ను కల్టివేట్ చేసుకోవాలి. నెగిటివ్ఫీలింగ్స్‌కు దూరంగా ఉన్నంత మాత్రంచేత ఆత్మజ్ఞానంకలుగదు. పాజిటివ్ఫీలింగ్స్‌ను అలవర్చుకోవాలి. నాకు ఎవరిమీద ద్వేషంలేదు అంటే సరిపోదు, ప్రేమించటం కూడా నేర్చుకోవాలి. రావణాసురుడు, విభీషణుడు, కుంబకర్ణుడు అన్నదమ్ములు. కుంబకర్ణుడు తమోగుణానికి గుర్తు, రావణాసురుడు రజోగుణానికి గుర్తు, విభీషణుడిది సత్వగుణం. రావణాసురుడికి చెప్పవలసిన మంచి అంతా విభీషణుడు చెప్పాడు. ఆయన వినలేదు అని కోపం తెచ్చుకోలేదు, ఆయన రజోగుణంకూడా విభీషణుడు వెళ్ళలేదు. వాడి సత్వగుణాన్ని కాపాడుకొంటూ, రాముడి పాదాలను ఆశ్రయించి తరించాడు. విభీషణుడి శరణాగతిని మనం అందరం గుర్తుపెట్టుకోవాలి. ఇప్పడు మీరు వచ్చి శ్రద్దగా వింటున్నారు. మీ పూర్వజన్మసంస్కారం భక్తికి అనుకూలంగా లేదు అనుకోండి దానిరుచి మీకు దొరకదు. నీవు ఏదైతే కాదో దానితో నీవు తాదాప్యం పొందుతున్నావు, అది ఒక భ్రాంతి. ఆభ్రాంతిని నశింపచేయటానికే జపధ్యానములు, విచారణ. పూర్వజన్మలలోవారు చేసిన సాధనవలన కొంతమంది సహజంగానే నిర్మలంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటారు. వారు ఉదాత్తమైన మోక్షాన్ని పొందుతారు. నీకు జప, ధ్యానములు తేలికగా ఉంటేచేసుకో, విచారణ తేలికగా ఉంటే చేసుకో. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణంచెయ్యి. వివేకం విడిచిపెట్టవద్దు. ఏది ఆత్మ ఏది ఆత్మకాదు, ఏది సత్యం ఏది సత్యం కాదు అని విడదీయటం నేర్చుకో, ఆవిశ్లేషణ అభివృద్ధి చేసుకో, వివేకాన్ని అభివృద్ధి చేసుకో, ఎవరో వచ్చి సహాయం చేస్తారని

ఎదురుచూడవద్దు. నీ కృషి ఏదో నీవు చేసుకొంటూ, నీ చైతన్యస్థాయిని పెంచుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీవు భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ఆత్మవిశ్వాసం ఉండాలి, తోటి మానవుడికి సేవచేయాలంటే ఆత్మవిశ్వాసం ఉండాలి. ఆత్మవిశ్వాసం లేకపోతే వాడు ప్రేమించలేడు, సేవించలేడు. ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. భగవంతుడి కంటే ఎక్కువగా మనలను ప్రేమించేవాడు ఎవడూలేడు. దేహం ప్రారబ్దం అనుభవించటానికి వచ్చింది. మన కుటుంబసభ్యులుకూడా వారి ప్రారబ్దమును బట్టి మనం, మన ప్రారబ్దాన్ని బట్టివారు ఒకే కొంపలో సిద్దమవుతాము. అక్కడ నుండి కోలాటాలు ప్రారంభమవుతాయి. ఒకరిని ఒకరు పొగడుకోవటమో, తిట్టుకోవటమో చేస్తూ ఏదో రోజున చనిపోతారు, కుటుంబ సభ్యులు కూడా ఒకరిని ఒకరు ప్రేమించుకొంటున్నాము అనుకొంటారు కాని అది భ్రమ అని వారికి తెలియటం లేదు, ప్రేమకు పరిమితులు లేవు. ప్రేమ సుఖాన్ని తీసుకొని వస్తుంది. భ్రాంతి దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. మనం భ్రాంతినే ప్రేమ అనుకొంటున్నాము, అది విడటీయటం నేర్చుకోండి అంటున్నారు భగవాన్. మన దేహప్రారబ్దాన్ని బట్టి పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేఖంగా ఉన్నా మన మనస్సుకు సౌందర్యం తీసుకొని రావటం కోసం, మన కాళ్లమీద మనం నిలబడేటట్లు చేయటం కోసం ఈశ్వరుడే ఇవిఅన్నీ చేస్తున్నాడు అని జ్ఞాపకం పెట్టుకోండి. మన మనస్సుకు యోగ్యత కలుగజేయటం కోసం ఈ సంఘటనలు క్రియేట్ చేస్తున్నాడు. ఇది అంతా మన మంచికే భగవంతుడు చేస్తున్నాడు అని మర్చిపోయినప్పడే మనం భగవంతుడిని తిడతాము, మనకు దుఃఖం వస్తుంది. మన మనస్సు యొక్క లోతులను పెంచటంకోసం, ఆత్మజ్ఞానసముపార్జనకు మన మనస్సును తయారుచేసి మనలను జ్ఞానశిఖరం మీద కూర్చోబెట్టటానికే ఈ సంఘటలను భగవంతుడు క్రియేట్ చేస్తున్నాడు గాని మన మీద విరోధంతో కాదు అని గ్రహించినవారు ధన్యులు, పుణ్యాత్ములు, ఉన్నది ఒక్కటే వస్తువు. ఆ వస్తువు తాలుక అనుభవం కలుగజేయటానికే భగవంతుడు మన జీవితాలను నడువుతూ ఉంటాడు. అందుచేత భగవంతుడి సంకల్పాన్ని గౌరవిస్తూ, ఆయన దయకు ప్రాతుడివి అయితే ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, అదేమోక్షం. నీ దేహప్రారబ్దాన్ని బట్టి పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నువ్వు ఉద్రేకపడి భగవంతుడి పాదాలను విడిచిపెట్టవద్దు. సత్వగుణం మనలను భగవంతుని పాదాల దగ్గరకు చేరుస్తుంది, అందువలన సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయండి. మనస్సును పెంచుకొనే పనులు చేయవద్దు. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తున్నారు అనుకోండి. స్తోత్రం చేయకముందు ఎలా ఉన్నారో, చేసిన తరువాత కూడా అలాగే ఉండలేకపోతే మనస్సు పెరిగిపోతుంది. మిమ్మల్ని ఎవరైనా నిందిస్తారు అనుకోండి. నిందకు ముందు మీ మనస్సు క్వైట్‌గా ఉంది అనుకోండి, నింద తరువాత మీ మనస్సు కృంగిపోతోంది అనుకోండి, మీకు సాధన లేదు అని అర్ధం. మీరు





కేవలం పూజకు, జపానికి పరిమితం అవ్వకూడదు, మీ మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకోవాలి. మీలో మైనస్ పాయింట్స్ ఏమి ఉన్నాయో చూసుకొని వాటిలోనుండి బయటకురండి. ప్లస్‌పాయింట్స్ కూడా నిజంకాదు కాని అవి ఆత్మజ్ఞానసముపార్జనకు సహకరిస్తాయి అందువలన వాటిని కల్టివేట్ చేసుకోండి, అద్వైతస్థితి పొందాక ఆప్లస్ పాయింట్స్ కూడా వాటంతట అవే రాలిపోతాయి. గాఢనిద్రలో మనస్సులేదు అక్కడ ఆత్మఉంది. జాగ్రదవస్థలో మనస్సు ఉంది, ఆత్మఉంది. కాని మనస్సును ఒక ప్రక్కకు పెట్టి ఆత్మగా జీవిస్తాము అనుకోండి మనకు ఆత్మానుభవం కలుగుతుంది. జాగ్రదవస్థలో ఎరుకతోపాటు గాఢనిద్రలో ఉన్న సుఖంకూడా వచ్చేస్తుంది. అప్పడు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా శాంతే, శరీరం ఉండటానికి , శరీరం లేకపోవటానికి ఉన్న బేధం రాలిపోతుంది. ఏదో ఆత్మ, ఆత్మ అని మీరు చెపుతున్నారు మీరు చెపుతున్నారు కాబట్టి మేము నమ్ముతున్నాము కాని మాకు అనుభవంలో లేదు. అనుభవంలోలేనిది ఉందని చెప్పటంకూడా మంచిదికాదు కదా అని అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అది ఉంది, ఉంది కాబట్టి క్రమేపి ధ్యానబలంవలన, విచారణాబలం వలన, సజ్జనసాంగత్యం వలన అది అనుభవంలోనికి వస్తుంది. అదిలేకపోతే మీరు జపధ్యానములు చేసిన తెలియబడదు. అందుచేత నీవు సందేహాలకు తావు ఇవ్వవద్దు. మీరు చేసుకొనే సాధన జాగ్రత్తగా, మెలుకువగా చేసుకోండి, అజాగ్రత్త పనికిరాదు. ఎదుటి వారి కళ్లతో నిన్ను చూసుకోవద్దు. నీకు కళ్ళు ఉన్నాయికదా నీకళ్లతో నిన్ను చూసుకో. ఎదుటి వారిబుద్ధితో ఆలోచించవద్దు, నీబుద్ధితో ఆలోచించుకో. స్వంతబుద్ధిని ఉపయోగించు, అప్పడు నీవు బాగుపడతావు. మనకు లోపల ఆత్మబలం లేనప్పడు, వివేకం లేనప్పడు, లోపల శాంతి లేనప్పడు బయట ఊరేగించినంత మాత్రంచేత మనకు కలిసివచ్చేది ఏదిలేదు, చివరకు రోడ్డు మీద ఉన్న దుమ్ము మిగులుతుంది. నీవు ఏది చేసినా అక్కడ మనస్సు ఉండాలి, నీచేతలో మనస్సు ఉండాలి, నీమాటలో మనస్సు ఉండాలి, నీప్రవర్తనలో మనస్సు ఉండాలి. నీవు ఇతరులకు సహాయసహకారములు చేస్తున్నప్పటికి నిర్మలమైన బుద్ధి ఉండాలి. నీవు చేసే సహకారం వారికి సుఖం కలుగజేయాలి, దానివలన నీకు జ్ఞానం కలగాలి. నువ్వుచేసే సహకారంవలన వారు సుఖపడకపోతే ఆసహకారం ఎందుకు?

మనకు ఎప్పడైనా చిరాకుగా ఉంది అనుకోండి ఆచిరాకు తగ్గటానికి సినిమాకు వెళ్లిపోతాము లేకపోతే టివి పెట్టుకుంటాములేకపోతే ప్రక్క ఇంటికి వెళ్లిపోతాము. ఇలా ఆ చిరాకునుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తాము. అలా చేయకుండా దానిని పేస్ చెయ్యి. ఏకారణంవలన ఆచిరాకువస్తోంది? అది ఎవరికి వస్తోంది. అని ప్రశ్నించుకొని దానిని పరిష్కారం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి, అప్పడు అది నశిస్తుంది. అంతేగాని దానినుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేసావనుకో తాత్కాలికంగా తగ్గిపోతుంది, తరువాత

మరల ప్రారంభమవుతుంది. ఏదైనా సమస్యవస్తే నాకు ఈసమస్య ఎందుకువస్తోంది. ఈ తలంపు నన్ను ఎందుకు పీడిస్తోంది? అని ప్రశ్నించుకోవాలి. ఆ తలంపుతో తాదాప్యం పొందుతున్నాముకాబట్టి అది నిన్ను పీడిస్తోంది. ఆ తలంపుతో ఉన్న తాదాప్యం కనుక కత్తిరించుకోగలిగితే అప్పటికప్పడే దుఃఖం ఆరిపోతుంది. నీ హృదయంలో ఉన్న వస్తువు నిత్యమైనది. శాశ్వతమైనది. అది పూర్ణంగా ఉంటుంది, అది అనుభంలోనికి వచ్చే వరకు నీవు ప్రయత్నం చేస్తూ ఉండాలి. ప్రయత్నంలేకుండా, సాధనలేకుండా సిద్ది కలుగదు. అమనస్కస్థితి పొందేవరకు మనం ప్రయత్నం చేస్తూ ఉండాలి. ప్రయత్నం చేసేటప్పడు నిర్మలంగా చెయ్యి, నిశ్చలంగా చెయ్యి, మనస్సు అక్కడపెట్టి చెయ్యి. మనకు ఇతరుల మీద ప్రేమ ఉన్నప్పడు మనస్సు ఒకరకంగా ఉంటుంది, ఇతరుల మీద ద్వేషం ఉన్నప్పడు మనస్సు ఒక రకంగా ఉంటుంది. మైత్రీభావన ఉన్నప్పడు మనస్సు ఒకరకంగా ఉంటుంది, విరోధ భావన ఉన్నప్పడు మనస్సు ఒక రకంగా ఉంటుంది. ఇది అంతా మనస్సు యొక్క చేష్టలే, ఇవి అన్నీ మనస్సులో వచ్చే వికారాలే. అందుచేత దానిని ఆర్పటానికి ప్రయత్నం చెయ్యి, అదే సాధన, నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో, మహాత్ములు చెప్పిన మాటలు ప్రమాణంగా తీసుకో అంతేగాని అహంకార ప్రేరితంగా మాట్లాడిన మాటలు ప్రమాణంగా తీసుకోవద్దు. బాహ్యసంఘటనలతో తాదాప్యం పొందవద్దు. బాహ్యమైన మహిమలకు ఆకర్షింపబడవద్దు, జాగ్రత్తగా ఉండండి. ఎవరైనా ఏదైనా చెప్పినా మీరు సొంతంగా ఆలోచించుకోండి. సాయంత్రానికి వైకుంఠం ఇస్తాను అని ఎవరైనా చెపుతారు అనుకోండి, నీకు ఆలోచనలేదా? వైకుంఠం అంటే అలావచ్చేదా? ఎవరైనా ఏదైనా చెప్పినా అందులో ఎంతవరకు వాస్తవం ఉంది అని చూసుకోండి. నీవు తినేతిండికి ఇచ్చే విలువ, తొడుక్కొనే బట్టలకు ఇచ్చే విలువ నీమనస్సును బాగుచేసుకోవటానికి ఇవ్వవా? భౌతిక విషయాలలోనే ఇంత జాగ్రత్తగా ఉంటున్నావు, మరి ఆధ్యాత్మికవిషయాలలో ఎంత జాగ్రత్తగా ఉంటే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి, వాటిలో ఏ ఆకర్షణకు లోబడినా ఆ చిన్న బలహీనత మరల కొన్ని వేల జన్మలు తీసుకొని వస్తుంది. బహుజాగ్రత్తగా ఉండండి. ఇప్పడు నీవు దేహంగా ఉంటున్నావు, మనస్సుగా ఉంటున్నావు, వికారాలుగా ఉంటున్నావు, ఇలా ఉన్నంత సేపు నీకు పునర్జన్మలు తప్పవు. నీవు నీవుగా ఉండేవరకు ప్రకృతి విడిచిపెట్టదు, రాగద్వేషములు విడిచిపెట్టవు అన్నీ నిన్ను వెంటాడుతూ ఉంటాయి. అందుచేత నీవు నీవుగా ఉండటం నేర్చుకో, చైతన్యం వైపుకు మనమొఖం తిరుగుతోంది అనుకోండి. మన ఆలోచనాస్థాయి మారిపోతుంది, మనకు వచ్చే తలంపులు మారిపోతాయి మన జీవితవిధానం మారిపోతుంది. ఈ ప్రపంచంలో ఉన్నా లోపల వేరే లోకంలో ఉన్నట్లు మనకు తెలుస్తుంది. నిజమైన సౌందర్యం మన హృదయంలోనే ఉంది. హృదయంలో ఉన్న సౌందర్యం చూసినవాడికి బాహ్యఆకర్షణ ఏమీ ఉండదు. నిజమైన మామిడిపండుకు, లక్కతో చేసిన మామిడిపండుకు ఎంతతేడా ఉంటుందో లోపల అందానికి, బయట అందానికి అంత తేడా ఉంటుంది. ప్రారబ్దాన్ని బట్టి నీకు సంతోషంరావచ్చు. దుఃఖంరావచ్చు ఇవి రెండూ మనస్సే. ఇవి అన్నీ మనస్సులోవచ్చే మంటలు అనే గ్రహింపు నీకు రావాలి. హృదయం దగ్గరకు వెళ్లేటప్పటికి నీసంతోషానికి, దుఃఖానికి దానితో సంబంధంలేదు, ఈ సంతోషాలు, దుఃఖాలు, ఇష్టాలు, అయిష్టాలు ఇవి అన్నీ మనస్సులో వచ్చే వికారాలు. అది ఒక మంట, ఆమంటను ఆర్పటానికే మనం చేసే సాధనలు అన్నీకూడా. మనం ఏదిగా ఉన్నామో దానిని మర్చిపోయాము, మర్చిపోయినా ఇబ్బందిలేదు, మనంకాని శరీరాన్ని, మనంకాని మనస్సును మనం అనుకొంటున్నాము, ఆత్మఅనుకొంటున్నాము. ఇక్కడనుండే సంసారం ప్రారంభమవుతోంది. నువ్వుకాని దానిని అవును అనుకోవటంవలన సఫరింగ్ మొదలవుతోంది. ఈ తప్పడు తాదాప్యాన్ని కట్ చేయాలి. లోపలఉన్న చైతన్యంతో మనకు తాదాప్యం ఉండాలి, అంటే రైట్ కాంటాక్టు ఉండాలి. నీవు ఏదిగా ఉన్నావో అలాగ ఉండగలిగితే నీకు అసలు దు:ఖమే లేదు. ఏదో ఉదయం కొద్దిసేపు, సాయంకాలం కొద్దిసేపు జపం చేసాము అంటే సరిపోదు, దానివలన చిరకాలంనుండి వస్తున్న వాసనలు పోతాయా? చెడువాసనలనుండి విడుదల పొందటానికి నీవుచేసే సాధన సరిపోదు. నీవు నిరంతరం ప్రయత్నం చేయాలి, కాలం కలిసిరావాలి, గురువుదయ ఉండాలి, ఇన్నీ ఉంటే గాని నీమనస్సులో ఉన్న లోపముల నుండి విడుదల పొందలేవు. మనం తెగిపోయిన గాలి పటాలం అనుకొని అలాపారిపోదాము, ఇలా పారిపోదాము అనుకొంటున్నాము. మనం తెగిపోయిన గాలిపటాలము కాదు, మన దారం భగవంతుడి చేతిలో ఉంది, అది గుర్తుపెట్టుకోండి. ఈ శరీరం ఎంతకాలం ఉండాలి, ఎటువంటి అనుభవాలు పొందాలి, ఎప్పడు నశించాలి అనేది నిర్ణయింపబడి ఉంటుంది, ఇది అంతా ప్రణాళికా బద్దంగా జరుగుతూ ఉంటుంది. మీ ధర్మాన్ని మీరు జాగ్రత్తగా నిర్వర్తించండి. మిగితా టైము అంతా మనస్సుకు లోచూపు నేర్పండి. మనస్సుకు లోచూపు అలవాటు అయితే లోపలఉన్న వస్తువు తాలుక రుచి, లోపల ఉన్న ఆనందం, శాంతి దానికి తెలుస్తుంది. లోపల ఉన్న ఆనందం, శాంతి మనస్సుకు తెలిసేకొలది అది వాటికి ఆకర్షింపబడి, ఇంకా డీపెన్ అవుతూ లోపలకువెళ్లి అక్కడ ఉన్న బ్రహ్మంలో ఐక్యమవుతుంది. మనస్సు లోపల ఉన్న అందాలు చూడటానికి అలవాటుపడితే బాహ్యంగా కనిపించే అందాలు దానికి పేలవంగా ఉంటాయి. మీరు మంచిని బోధించండి. వారు వినలేదు అని మీరు వికారం పెట్టుకోవద్దు, అలా వికారం పెట్టుకొంటే వారికంటే ముందు మీరుపాడైపోతారు. వికారాలు పెట్టుకుంటే మనం నిర్వికారస్థితిని పొందలేము. మనస్సుకులోచూపు లేకపోతే వివేకం పెరగదు, ఆలోచనాస్థాయి పెరగదు, మన చైతన్యస్థాయి పెరగదు. నీ హృదయంలో ఆనందం ఉన్నప్పటికి మనస్సుకు లోచూపు లేకపోతే అది నీకు అనుభవంలోనికిరాదు అందుచేత మనస్సుకు లోచూపునేర్పండి.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 26-10-03, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా



ప్రతీ జీవుడు శాంతిని, సుఖాన్ని కోరుకొంటాడు. శాంతి, సుఖం బజారులో దొరకదు. డబ్బు పెట్టి బంగారాన్ని, మనకు కావలసిన వస్తువులను బజారులో కొనుక్కోవచ్చును కాని ఎంత డబ్బు పెట్టినా బజారులో శాంతి, సుఖం దొరకవు. శాంతి, సుఖం బజారులో అమ్మే వస్తువులు కాదు. వాటిని మన హృదయంలోనే పొందాలి. మనం రూపదృష్టిని, నామ దృష్టిని తగ్గించుకొంటూ రావాలి. 'విడిచిపెట్టి అనుభవించు, త్యజించి అనుభవించు' అని ఒక ఉపనిషత్ చెప్పింది. అందరి హృదయాలలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. మనం అరటిపండు తినేటప్పుడు తొక్కను విడిచిపెట్టి లోపలఉన్న గుంజును ఎలా తింటున్నామో అలాగ రూపదృష్టి, నామదృష్టి విడిచిపెట్టి అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను అనుభవించు, ఆయనను ఎంజాయ్‌చెయ్యి. రూపదృష్టి, నామదృష్టి పెంచుకొంటే మనం బంధంలో పడతాము. లోపల ఉన్న పరమాత్మను మనం ఎంజాయ్ చేస్తూ ఉంటే, పరమాత్మదృష్టి కలిగిఉంటే మనకు మోక్షం కలుగుతుంది. భగవంతుడు మనకు వివేకాన్ని ఇచ్చాడు, దానిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. భగవంతుడు మనకు ఏఅవకాశములయితే ఇచ్చాడో వాటిని మనం సద్వినియోగం చేసుకోవాలి. మనం సమాజానికి ఎంతోకొంత ఋణపడిఉన్నాము. ఎందుచేతనంటే సమాజం కూడా మనకు కొంచెం తెలివితేటలు నేర్పుతుంది. మనం సమాజంనుండి కొన్నిపాఠాలు నేర్చుకొంటున్నాము కాబట్టి మనం సమాజానికి ఋణపడిఉన్నాము. అందుచేత సమాజానికి మనం చేయగలిగిన సహకారం చేయాలి. మీ క్షేమంతో పాటు సమాజక్షేమం కూడా చూస్తూఉంటే మనకు అవగాహన యొక్క లోతులు పెరుగుతాయి. మనం మంచిగా మాట్లాడితే సరిపోదు, లోపల మంచిఉద్దేశ్యం కూడా ఉండాలి. నీకు సజ్జనసాంగత్యం దొరకలేదని దుష్టసాంగత్యం చేయకు అంటున్నారు





ఆచార్యులవారు. సజ్జనసాంగత్యం వలన మనకు ఎంతో కొంత వైరాగ్యం కలుగుతుంది. మేము సాధన చేస్తున్నాము మనస్సు నిశ్చలంగా ఉండటం లేదు, నిర్మలంగా ఉండటంలేదు అని చాలామంది అంటారు. దానికి ఒకటే కారణం వైరాగ్యం లేకపోవడం కారణం. జీవితం పొడుగునా అభ్యాస, వైరాగ్యములు విడిచి పెట్టవద్దు అని భగవంతుడు గీతలో చెప్పాడు. అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా మనకు ఆత్మానుభవం కలగదు. మనలో మంచి ఉంది, చెడు ఉంది. చెడును తగ్గించుకుంటూ, మంచిని పెంచుకుంటూ రావాలి. మనం మాట్లాడే మాటలో, మనం చేసే పనిలో, మనకు వచ్చే తలంపులో, ప్రతిచోట వివేకాన్ని ఉపయోగించుకుంటూ రావాలి. ఇది బండతనంగా వచ్చేది కాదు. మనలో చనిపోయేవాడు ఉన్నాడు, చావుతోటి సంబంధం లేనివాడు కూడా మనలో ఉన్నాడు. చనిపోయేవాడు ప్రతివాడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు అంటే హృదయంలో ఉన్న చావులేని వస్తువు వాడికిదొరకలేదు అని అర్థం. హృదయంలో ఉన్న మరణంలేని వస్తువు వాడికి అనుభవంలోనికి వస్తే శరీరం చనిపోయేటపుడు నేను చనిపోతున్నాను అని అనుకోడు ఎందుచేతనంటే ఆ చనిపోయేవాడు శరీరం ఉండగానే చనిపోయాడు కాబట్టి. మనం భగవంతుడిలోనుండి వచ్చాము, మరల భగవంతుడిలో ఐక్యమయ్యేవరకూ మనకు శాంతి లేదు, సుఖం లేదు. మనం భగవంతుడిలో ఐక్యమవ్వటం కోసమే భక్తియోగం, ధ్యానయోగం, కర్మయోగం ఈ యోగాలన్నీ పెట్టాడు. మనోనిగ్రహానికి జపధ్యానములు మంచివే, ఇవి రెండూ సరిపోవు. ధ్యానం చేస్తున్నాము మనస్సు నిలబడటంలేదు అని కొంతమంది అంటారు. గురువు అనుగ్రహం, శాస్త్రంయొక్క అనుగ్రహం, ఈశ్వరానుగ్రహం ఉంటేగాని వారు ధ్యానం చేసినా మనస్సు నిలబడదు. పెద్దలను గౌరవించడం వలన, సేవించడం వలన మనకు వివేకం పెరుగుతుంది. చాలామంది మనస్సులో అశాంతిగా ఉంటారు, ఏదో పోగొట్టుకొంటున్నాము అని అనుకొంటారు. డబ్బు పోయింది అనుకోండి, ఏదో పోగొట్టుకొంటున్నాము అనుకొంటారు. ధనం ఎప్పుడూ స్టడీగా ఉండదు. అలా వస్తూఉంటుంది, పోతూ ఉంటుంది. ధనంలో కొంచం ఈవిల్‌నేచర్ ఉంటుంది, చాలా కుటుంబాల్లో పేచీలకు ధనమే కారణం. నీకు తెలిసిన మంచి ఉంటే ఇతరులకు భోధించు. నీకు పదిపైసలు ఉంటే ఒక పైసా ఎవరికైనా సహకరించు. భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను సమాజానికి కూడా ఉపయోగించు. ఈపనులు అన్నీ ఎందుకు చేయాలి అంటే ఇవి నీ జపధ్యానములకు సపోర్టుగా ఉంటే అప్పుడు నీమనస్సు నిశ్చలమవుతుంది, నిర్మలమవుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది. మనం ముఖాలు చూసి పీటలు వేస్తాము, ముఖాలు చూసి పీటలు వేసే వారికి ఆత్మజ్ఞానం కలుగదు, ఈ జీవకోటి అంతా ఎక్కడనుండి అయితే వచ్చిందో, ఏ వస్తువు అయితే ఈ సృష్టి అంతా వ్యాపించి ఉందో ఆవస్తువుని పనిద్వారా సేవించేవాడు, ఆరాధించేవాడు ధన్యుడు అవుతాడు, ఆత్మజ్ఞాని అవుతాడు అని పరమాత్మ చెప్పాడు. నీకు ఎంతోధనం, యశస్సు, అధికారం ఉంది అనుకో,

నీకు అంగబలం, అర్ధబలం అన్ని బలాలు ఉన్నాయి అనుకో అయినా నీకు ఆత్మజ్ఞానం లేకపోతే వీటివలన ప్రయోజనం ఏమిటి? ఇవి అన్నీ స్వప్నసమానమే కదా అంటున్నారు ఆచార్యులవారు. కొంతమంది ప్రాణాయామానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు ప్రాణాయామం కూడా మనోనిగ్రహానికి ఎక్కువ సహకరిస్తుంది. స్మరణభక్తిని కూడా విడిచిపెట్టకూడదు. నిరంతరం మనం పరమేశ్వరుడిని స్మరించుకోవటం వలన కూడా మన అహంభావన నశిస్తుంది. భక్తి లేకపోతే ప్రేమలేదు, భక్తి లేకపోతే బుద్ధి శుద్ధిఅవ్వదు, భక్తి లేకపోతే ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు, భక్తి లేకుండా ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం కూడా రాదు. మనలో రెండు నేనులు ఉన్నాయి, ఒకటి సత్యమైన నేను, రెండు అసత్యమైన నేను. అసత్యమైన నేనును విడిచి పెట్టటానికే సజ్జనసాంగత్యం. సజ్జనసాంగత్యంలేకుండా వైరాగ్యం రాదు. వైరాగ్యం లేకుండా మోక్షం రాదు. అసత్యమైననేనును తొలగించుకొనే శక్తి మనకు లేనప్పుడు సత్యమైననేను మనకు అనుభవంలోనికి రాదు, ఇందులో రాజీ పడే అవకాశం లేదు. సత్యమైన నేను మనకు గోచరిస్తేనే గాని మనకు అమృతానుభవం కలుగదు, అమృతానుభవం కలిగితే గాని మనం మరణంలోనుండి విడుదలపొందలేము. నిరంతరం ఎవరైతే నన్ను స్మరిస్తున్నారో, నాకు ఇష్టమైన పనులు ఎవరైతే చేస్తున్నారో వారికి సద్బుద్ధిని, సహృదయాన్ని ఇస్తాను, వారి హృదయంలో జ్ఞానదీపాన్ని వెలిగిస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుడి సంకల్పాన్ని గౌరవించడం నేర్చుకోండి, ఇప్పడే ఈక్షణంలోనే మనకు జ్ఞానోదయం అవుతుంది. అంటే మనకు ప్రారబ్ధం అనుకూలంగా ఉంది అనుకోండి అదీ భగవంతుడి సంకల్పమే, ప్రారబ్ధం అనుకూలంగా లేదు అనుకోండి అది కూడా భగవంతుడి సంకల్పమే. కాని మనం ప్రారబ్ధం అనుకూలంగా ఉంటే ఒక రకంగా ఉంటాము, ప్రారబ్ధం మనకు వ్యతిరేకంగా ఉంటే ఒక రకంగా ఉంటాము. మనకు వ్యతిరేకమైన ప్రారబ్ధం కూడా ఈశ్వరసంకల్పంలో భాగమే, ఇదీ ఆయన సంకల్పమే, అదీ ఆయన సంకల్పమే అనుకున్నపుడు మనస్సు ఇప్పుడే, ఇక్కడే చల్లబడిపోతుంది, మనస్సుకు ఒక విధమైన శాంతి కలుగుతుంది, ఆనందం కలుగుతుంది, మోహం నశిస్తుంది. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే నీవు ఎన్ని భజనలు చేసినా, గుడి చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా, ఎన్ని నదులలో మునిగినా, ఎన్ని యాత్రలు చేసినా వీటివలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది అంతమాత్రం చేతనే ఆత్మజ్ఞానం ఆశించకు. పుణ్యక్షేత్రాలకు వెళ్లటం మంచిదే. ఇప్పుడు చీకటి ఉంది, భజనలు చేయటంవలన చీకటి పోదు, సూర్యుడు ఉదయించాలి లేకపోతే అక్కడ దీపం వెలిగించాలి. నీకు జ్ఞానోదయం అవ్వకుండా అజ్ఞానం నశించదు. అజ్ఞానం ఉన్న వాడికే ప్రపంచం, అజ్ఞానం ఉన్నవాడికే చావుపుట్టుకలు, అజ్ఞానం లేనివాడికి ఏదీలేదు. నీకు స్వరూపజ్ఞానం లేకుండా అజ్ఞానం నశించదు. నువ్వు ఎన్ని భజనలు చేసినా, ఎన్ని యాత్రలు చేసినా తాడు పాముగా కనిపిస్తున్నంతకాలం నీకు భయం విడిచిపెట్టదు. అలాగే ఆత్మ జీవుడుగా కనిపిస్తున్నంతకాలం నిన్ను దుఃఖం విడిచిపెట్టదు, భయం విడిచిపెట్టదు. జన్మలు విడిచిపెట్టవు, భేదబుద్ధి విడిచిపెట్టదు. ఆత్మలాభం ఒక్కటే నిజమైన లాభం మిగతా లాభాలు ఉండవచ్చు అవి అన్నీ కూడా స్వప్నసమానము. గౌరవం ఆశించేవాడికి ఆ గౌరవంపోతే ఏదోపోయినట్లు అనిపిస్తుంది కాని గౌరవం ఆశించకపోతే ఏమీలేదు, వాడు గౌరవంకాదు, వాడు ఆత్మ. అలాగే మనకు జయం వచ్చినప్పుడు ఏదో వచ్చింది అనుకొంటున్నాము, ఏమీరాలేదు అపజయం కలిగినప్పుడు ఏమీపోలేదు, ఈసమస్యలు అన్నీ మనస్సుకే, ఆత్మకు సమస్యలు లేవు. అందుకే భగవాన్ ఏమి చెప్పారు అంటే మనస్సు ఉంటే అంతా ఉంది, మనస్సులేకపోతే ఏమీలేదు అన్నారు. ఇతరుల విషయాలు మనకు అనవసరం. మన మనస్సును ఎంతవరకు బాగుచేసుకొంటున్నాము అది చూసుకోవాలి, మనస్సును మంచి డైరెక్షన్‌లో పెట్టుకోవాలి, రాంగ్ డైరక్షన్‌లో స్పీడుగా వెళ్లినా గమ్యానికి చేరలేము. రైట్ డైరెక్షన్‌లో స్లోగా వెళ్లినా కొద్దిగా ఆలస్యంగా అయినా గమ్యానికి చేరుకొంటాము. శరీరం చనిపోతున్నప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. అదికూడా ఒకతలంపే. శరీరం చనిపోతుంది అనుకొనేవాడు లోపల ఉన్నాడు, వాడు చనిపోయేవరకు నీకు అమృతానుభంకలుగదు. అది ఎప్పడోకాదు, ఎక్కడోకాదు. ఇప్పడే, ఇక్కడే ఈ శరీరంలో ఉండగానే అదిసాధించు. అప్పడు మరణం లేనివాడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. నేను చనిపోతున్నాను, నేను చనిపోతున్నాను అని నీ శరీరంలోపల ఉండి ఎవడైతే అంటున్నాడో వాడిని తీసి ఒక ప్రక్కన పెట్టటానికే ఈసాధన, సత్పురుషులసహవాసం, జ్ఞానయజ్ఞాలు, ఇవి అన్నీ దానికే. మనం మహాత్ములను మర్చిపోయాము. మహర్షులను మరచిపోయాము. మనం దుష్టసాంగత్యం చేస్తూఉంటే తులసీదాసు జ్ఞాపకంరాడు, రామకృష్ణుడు జ్ఞాపకంరాడు, భగవాన్ జ్ఞాపకంరాడు, ఏ మహాత్ముడు జ్ఞాపకంరాడు. మనకు మహాత్ములు జ్ఞాపకం వస్తేకదా వారి మాటలు మనకు గుర్తుకు వచ్చేది. తులసీదాస్ అనేవాడు ఓరామా! నీవు నాహృదయంలో ప్రవేశించి నాలోని చెడును తొలగించినప్పుడుకదా ఆత్మారాముడు నాకు అనుభవంలోనికి వచ్చేది అంటాడు. తులసీదాస్ జ్ఞాపకం వస్తే కదా ఈమాటలు మనకు గుర్తువచ్చేది. మనకు మాటదగ్గర క్రమశిక్షణలేదు, ఆలోచన దగ్గర క్రమశిక్షణలేదు ఇంక మహాత్ములు ఎలా జ్ఞాపకం వస్తారు. వారితో ఎప్పడైనా మానసిక అనుబంధం ఉంటేకదా వారు మనకు జ్ఞాపకం వచ్చేది. నీవు దుష్టసాంగత్యమే విడిచిపెట్టలేదు. ఇంకనీకు సజ్జనసాంగత్యం విలువ ఏమి తెలుస్తుంది. సజ్జనసాంగత్యం చేస్తేగాని నీకు వివేకంరాదు, వైరాగ్యంరాదు. దుష్టసాంగత్యం విడిచిపెట్టకుండా మనం ఆత్మజ్ఞానం ఆశిస్తూ ఉంటే అది ఎలాసాధ్యం. సజ్జనసాంగత్యం ఉన్నవాడికే అది లభించడం కష్టం. మాకు సమస్యలు ఉన్నాయి అని కొంతమంది చెపుతూఉంటారు. మాకు సమస్యలు ఉన్నాయి అని చెప్పేవాడు ఎవడు? అసలు వాడుఅంటూ ఒకడు ఉన్నాడా? ఈసమస్యలు అన్నీ మనస్సుకే. మనస్సు అణిగిపోతే అన్నీ అణిగిపోతాయి. ఉన్నది ఒక్కటే వస్తువు, దానికి భిన్నంగా ఏమీలేదు.

ఇలావేరుగా ఏదో ఉన్నట్లు నీ మనస్సు అనిపింపజేస్తుంది. మనస్సుతో గ్రహించేది మిధ్యాజ్ఞానం, మనస్సు ఎంత నిజమో అదికూడా అంతే నిజం. ఎక్కడైతే మనస్సు నశించిందో అక్కడ నిజమైన జ్ఞానం గోచరిస్తుంది. దేహానికి పరిమితులు ఉన్నాయి, మనస్సుకు పరిమితులు ఉన్నాయి కాని పరిమితులు లేనిది, హద్దులు లేనిది బ్రహ్మంఒక్కటే. భక్తిలో ఏముంది అని కొంతమంది అంటూ ఉంటారు, అది లేనివాడికి అలా అనిపిస్తుంది. అది సంపాదించుకోవటం ప్రారంభిస్తే అందులో ఉన్నరుచి, వైభవం మనకు తెలుస్తుంది. మాటలు చెప్పటం తేలిక. జపధ్యానములు యాంత్రికంగా చేయకూడదు, అక్కడ మనస్సు పెట్టి చేయాలి, హృదయపూర్వకంగా చేయాలి. మనం బయట, లోపల కూడా శుచిగా ఉండాలి. మనం దేహం విషయంలో కొంత జాగ్రత్త పడుతున్నాము కాని మనస్సు విషయంలో అసలు జాగ్రత్తపడటం లేదు. దేహానికి రోగంవస్తే మందులు మింగుతున్నాము కాని మనస్సులో ఉన్నచెడుతలంపుల నుండి విడుదల పొందటానికి ప్రయత్నంచేయటంలేదు. ఒకవేళ ఏదైనా ప్రయత్నం చేసినా యాంత్రికంగా చేస్తున్నాము కాని మనస్సు అక్కడపెట్టి చేయటంలేదు. నాలోఉన్న చెడును తొలగించుకోవటానికి నాప్రయత్నం ఏదో నేను చేస్తున్నాను, నాప్రయత్నం ఒక్కటే సరిపోదు, నీదయకావాలి. నిన్ను వేగిరపరచటం లేదు, నా బలహీనత ఏమిటో స్పష్టపరుస్తున్నాను. నెమ్మదిగా ఆబలహీనతల నుండి నన్ను విడుదలచెయ్యి. గౌరవాలకోసం, ఆడంబరంకోసం, ఇతరుల మెప్పుకోసం మంచిపనిచేస్తే మనలను భగవంతుడు అనుగ్రహించడు. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు, మనకు వచ్చే ప్రతీతలంపును ఆయనచూస్తున్నాడు. నేను ఏదో మంచిపని చేసాను అనుకోండి లోకం ఆమంచిపని చూస్తుంది. కాని భగవంతుడు అలాకాదు ఆమంచిపని ఎందుకు చేసాను, ఏ ఉద్దేశంతో చేసాను అని చూస్తాడు. ఏ ఉద్దేశంతో ఆ మంచిపని చేసావు అనేది ముఖ్యం, దానిని బట్టి ఆధ్యాత్మిక స్టేటస్ వస్తుంది. ఈ మధ్య యోగాలు పేరుచెప్పి స్మరణభక్తిని వదిలేసారు. లోపల కుట్రఉంటేనే ఫెయిన్ వస్తుంది. ఆకుట్ర ఈనాటిది కాదు, చిరకాలం నుండి వస్తోంది. మేకు బాగాలోపలకు ఉంది అనుకో దానిని తేలికగా లాగితే రాదు. అది ఎంతలోపలకు ఉందో అంతబలంగా లాగితే వస్తుంది. నీవాసనలు, సంస్కారములు ఎంతదీర్ఘంగా ఉన్నాయో అంతదీర్ఘంగా, అంతలోతుగా సాధన చేస్తేగాని అందులోనుండి విడుదల పొందలేవు. ఓపరమేశ్వరుడా! నీ అనుభవం పొందటానికి అడ్డువచ్చేగుణాలు నాలోఏవైతే ఉన్నాయో వాటిని తొలగించు. నాలోవిరుద్ధమైన గుణాలు ఏమి ఉన్నాయో నాకంటే నీకే బాగాతెలుసు, వాటిని తొలగించు. నాకు ఏదిమంచిదో నాకంటే నీకే బాగా తెలుసు. పరమాత్మ ఏమి చెపుతున్నాడు అంటే నోటితో ఆరాధిస్తే సరిపోదు, పనితో కూడా ఆరాధించు నేను నీకు వ్యక్తమవుతాను అంటున్నాడు. అంతర్యామిగా ఉన్న భగవంతుడు నీకు అనుభవంలోనికి రానప్పుడు నీకు ఎన్నిమహిమలు ఉంటే లాభంఏమిటి? అవి ఒకటి లేని సున్నలతో సమానము.

**20-11-2003**



భగవంతుడు ఎవరి ఇంటిలోను లేడు ఆయన మన హృదయంలోనే అంతర్యామిగా ఉన్నాడు. మనం అక్కడికి వెళ్లటంలేదు, ఆయన మనకు తెలియటంలేదు. ఎవరి దయ వలన మనకు అన్నీ వస్తున్నాయో ఆయన దగ్గర ఏమీలేదు, అసలు ఆయనే లేడు అని మనం అనుకొంటున్నాము, మన జ్ఞానం ఇంతవరకు వచ్చింది. నాన్నగారి ఉపన్యాసం వినివచ్చాను సాయంకాలానికి జ్ఞానం రాలేదు అనుకొంటే ఎలాగ? వెయిట్ చేయాలి. కొంతమంది ఏమీ ఆశించకుండా సహాయంచేస్తారు. సహాయం, సహాయంకోసమే చేస్తారు. వారిమీద భగవంతుని దయ వర్షిస్తుంది. ధన సంపాదనకంటే, విద్య సంపాదనకంటే మంచిగుణం సంపాదించటం చాలా కష్టం. కొంతమంది డబ్బుదగ్గర చాలా జాగ్రత్తగా ఉంటారు, మంచిదే, కాని తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండరు, అంటే మీ డబ్బుకు ఇచ్చేవిలువ మీకు వచ్చేతలంపులకు ఇవ్వటం లేదు. తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉంటేనే భగవదనుభవం కలుగుతుంది. మనకు అనవసరమైన తలంపులు వస్తూఉంటే ఇటువంటి తలంపులు రాకుండా చూసుకోవాలి, వాటిలోనుండి విడుదలపొందాలి, మంచితలంపులను జాగ్రత్తపెట్టుకోవాలి, వాటిని ఉపయోగించుకోవాలి, చెడు తలంపులు రాకుండా చూసుకోవాలి అని ఇటువంటి శ్రద్ధ వహించే సాధకులే తక్కువ. డబ్బుపోతే పోయింది, పోయింది అని కంగారు పడుతున్నారు. కాని అనవసరమైన తలంపులు వస్తూఉంటే మీరు ఎందుకు కంగారుపడటం లేదు. సాధనాబలంలేక, సజ్జనసాంగత్యంలేక, స్మరణభక్తిలేక, ఈశ్వరుని సంకల్పంయందు గౌరవంలేక మనం ఇలా తయారవుతున్నాము. మహాత్ములపట్ల, మహర్షులపట్ల నీకు గౌరవం లేనప్పుడు భగవంతుని పట్ల గౌరవం ఎలా వస్తుంది, వారు భగవంతుని ప్రతినిధులు. ఒక మనిషి పరమపవిత్రుడు అయినప్పటికి ఉత్తమోత్తముడు అయినప్పటికి అది గమ్యంకాదు, గమ్యం బ్రహ్మమే. ఏదైతే సదా ఉంటుందో, దేనికైతే జనన మరణములు లేవో, యుగాలు మారినా ఈప్రపంచం లయమయినా ఏదైతే లయంకాకుండా ఉంటుందో అదే బ్రహ్మం, అదే ఆత్మ. ఆ బ్రాహ్మీస్థితి పొందటానికి ఉత్తమగుణాలు సహకరిస్తాయి కాబట్టి విసుగులేకుండా, వికారం లేకుండా వాటిని కల్టివేట్‌చేసుకో. డబ్బుసంపాదనకోసం విసుగు, విరామం లేకుండా ఎలా కృషిచేస్తామో ఉత్తమగుణాలను అలవర్చుకోవటానికి అలా కృషిచెయ్యి. మనకు కావలసింది వినోదంకాదు, విజ్ఞానం. గురువు ఎందుకు అని అనుకోవద్దు, గైడెన్స్ కోసం గురువు అవసరం. వస్తువు మన హృదయంలోనే ఉంది, అక్కడకు వెళ్లటానికి గురువు నీకు గైడెన్స్ ఇస్తాడు. మాట, చేత, తలంపు విషయంలో జాగ్రత్తగా ఉంటూ, అనవసరమైనవి రాకుండా చూసుకొంటూ ఉంటే, అలా మనప్రవర్తనను తీర్చిదిద్దుకొంటే, గురువు సహాయం మనకు అందుతుంది, అప్పుడు మనకు తెలియకుండానే ఆత్మలో ఐక్యమవుతాము. నేను చనిపోతున్నాను అని చెప్పేవాడు మన లోపల ఉన్నాడు. చావులేని సత్యవస్తువు నీలోపలే ఉంది. వాడిని విడిచిపెడితే వీడు దొరుకుతాడు. మీకు సరియైన అవగాహన వచ్చినప్పుడు,

లోపలఉన్న సత్యవస్తువు యొక్క అనుభవం మీకు కలిగినప్పడు శరీరం ఉండటానికి, శరీరంలేకపోవటానికి ఉన్న బేధం మీకు తెలియకుండానే పోతుంది. అప్పడు ఎటుచూసినా ఆనందమే. ప్రపంచం అంటే రూపము, నామము, క్రియ. జ్ఞాని నిష్ప్రపంచస్థితిలో ఉంటాడు. దేహంఉన్నా దేహం లేనివాడిగా ఉంటాడు. నీ ప్రవర్తన పాజిటివ్‌గా ఉన్నప్పడు, సరళంగా ఉన్నప్పడు, ఆడంబరాలకు దూరంగా ఉన్నప్పడు నీవు సహజంగానే ఆత్మలో ఐక్యమవుతావు. భగవంతుని పాదాలయందు ప్రేమలేకపోతే, భక్తిలేకపోతే ఈ సంసారసముద్రంనుండి విడుదల పొందలేము. కోరికలను సంతృప్తి పరచే కొలది అవి పెరిగిపోతాయి. ఈ కోరిక ఎవరికి వచ్చింది, ఏ నేనుకు వచ్చింది అని ప్రశ్నించుకొంటూఉంటే మూలతలంపు ఉపసంహరింప బడుతూఉంటుంది, అప్పడు దానికి వచ్చే ఇతరతలంపులు ఆగిపోతాయి. పరబ్రహ్మంలో ఐక్యం అయ్యే ప్రక్రియ యోగం అంతేకాని కేవలం వాకింగ్, ఆసనాలు యోగంకాదు. బ్రహ్మానుభవం పొందకుండా మీరు గొప్పగొప్ప లోకాలకు వెళ్ళినా అజ్ఞానం ఉన్నంతకాలం తిరిగి ఈ భూమిమీదకు రావలసిందే. మీరు చనిపోయిన తరువాత స్వర్గానికి వెళతారు అని ఎవరైనా చెపితే 100 బస్తాలు బియ్యం, పప్పలు ఇంకా డబ్బులు ఇవి అన్నీఇస్తారు. మీరు మాకు ఏమి ఇవ్వనక్కరలేదు. సబ్జక్టును 10 నిమిషాలు ప్రశాంతంగా వినండి అంటే వినరు, 'అయామ్ బిజీ' అంటారు. సబ్జక్టును వినండి, ఎంజాయ్ చేయండి అంటే చేయరు. మనం దేనినయితే పొందాలి అనుకొంటున్నామో దానిగురించి శ్రణంచేయాలి. విసుగు వచ్చేలా వినాలి. శ్రవణభక్తి కూడా అవసరమే దాని వలన మనకు జిజ్ఞాసకలుగుతుంది. జిజ్ఞాస లేకుండా మనం వస్తువును పొందలేము. మనకు జిజ్ఞాసలేదు, ఎంతసేపు ఏదో లోకాలకు వెళదామనే రాకపోకల గొడవలలో ఉంటున్నాము. మనకు జిజ్ఞాస కలగటానికి సజ్జనసాంగత్యం అవసరం.





# ఆనందమయునితో కాశీయాత్ర

ది. 27-10-2003 నుండి పన్నెండు రోజులు పాటు సద్గురు శ్రీనాన్నగారితో నాలుగువందలమంది భక్తులు కాశీయాత్రలో పొందిన ఆనంద అనుభూతుల అక్షరరూపమే ఈనివేదిక. హిందువులకు పరమ పవిత్రమైన కార్యం కాశీ విశ్వేశ్వరుని దర్శించటం. అక్కడి వసతి సౌకర్యాలకు, ఆదరణ, ఆప్యాయతలకు, నిష్కామకర్మకు ప్రతిరూపమైన "తారకరామానిలయా"న్ని శ్రీనాన్నగారు ప్రారంభించటం ఈయాత్రలో ఒకభాగం. భూగోళం జలమయమై ప్రళయం సంభవించినప్పడుకూడా, కాశీక్షేత్రం మహావెలుగుతో ప్రకాశించింది అని ప్రతీతి. కృతయుగం నుండి నేటివరకూ, గంగఒడ్డున ఉన్న అన్ని ఘాట్లలోనూ, నిత్యపితృతర్పణాలు జరగటం, కేదారేశ్వరుని దర్శించి, విశాలాక్షి, అన్నపూర్ణమ్మలను, విశ్వేశ్వరుని, కాలభైరవుని దర్శించి, అర్చించటం జరుగుతున్నది. శ్రీనాన్నగారితో నావల్లో గంగామాత ఒడిలో ఉండి కార్తీకమాసంలో గంగకు హారతులు అర్పించే ఘట్టం ఒక మధురస్మృతి. శ్రీరామకృష్ణ పరమహంసగారు కాశీలో నివశించినస్థలం, వ్యాసకాశీలో రాజప్రాసాదం, వ్యాసులవారు నివశించిన స్థలంనుంచి, నిర్మలమైన గంగామాతా ఆకృతి, ప్రకృతి అందాలు, సూర్యాస్తమయ సోయగాలు, చూడటం అవదులులేని ఆనందాన్ని కలిగిస్తాయి. అలాగేతుల సీమానసమందిరం, త్రివేణీ సంగమాలు, విష్ణుపాద స్పర్శతో, పునీతులయ్యేయోగం, గయ "క్షేత్రం వల్ల జరుగుతుంది. సారానాద్, బుద్దగయలు, దయాసముద్రుడైన బుద్ధభగవానుని, పాదస్పర్శతో, పావనమైన, ఆ పుణ్యక్షేత్రాలలో, ప్రతీ అంగుళం ఆధ్యాత్మిక ప్రగతికి, సంకేతంగా, భక్తిభావం, పెల్లుబికే సంకేతాలు, అనేకమైనవి స్ఫురిస్తాయి. భాషకందని భావన, మనస్సు ద్రవించే స్థితి, అక్కడ కలుగుతుంది. పైరుగాలి వేస్తే విసినికర్రతో పనేముంది అనే నానుడి, యిక్కడ ప్రత్యక్ష నిదర్శనం, సాధకుని ప్రయత్నం నామమాత్రంగా ఉన్నా, నిర్వాహణస్థితిని పొందటానికి ఆయన అనుగ్రహం అందుతోందని సాధకులు అనుభవపూర్వకంగా గ్రహిస్తారు ఆయా ప్రదేశాల్లోని, సంస్కృతి, సాంప్రదాయాల, వైషిష్యాలను గ్రహిస్తాము, ఈయాత్ర ఆద్యంతం ఆనందదాయకం, స్ఫూర్తిదాయకం, విజ్ఞానదాయకం.

– సాగిరాజు రామకృష్ణంరాజు (అర్ధవరం)

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 23-11-03 | ఆది | పాలకొల్లు, మధ్యాహ్నం 3 గం॥లకు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 28-11-03 | శుక్ర | ప్రాతళ్ళమెరక |
| 29 టు 1-12-03 | | కేంపు |
| 2 టు 9-12-03 | | అరుణాచలం కేంపు (7-12-03 దీపోత్సవం - శ్రీ నాన్నాశ్రమం) |
| 18-12-03 | గురు | జిన్నూరు - శ్రీ రమణక్షేత్రం |
| 25-12-03 | గురు | కొవ్వాడ (వయా) కాకినాడ - సాయిబాబా మందిరం |



పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు గ్రామస్తులు, భగవాన్ శ్రీ రమణ మహర్షి భక్తులు
శ్రీ రమణక్షేత్రం కమిటీ సభ్యులు శ్రీ కొత్తపల్లి శ్రీరామచంద్రరాజు గారు (40)
ది.6-11-2003న స్వర్గస్థులైనారు

## భక్తులకు మనవి !

### సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనములు ఆడియో కేసెట్స్

"టి" సీరీస్ కంపెనీ కేసట్ ధర రూ.35/-
ఆర్డినరీ కేసట్ ధర రూ.20/- (ఆర్డరుపై ఇవ్వబడును)
కొరియర్ చార్జి రూ.3/- అదనం. కేసట్లు కొరకు యం.ఓ., జిన్నూరుపై / డి.డి. పాలకొల్లు బ్రాంచిపై పంపవలసిన చిరునామా :

**పి.ఎస్. రామరాజు, ఎడిటర్, శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు, ప॥గో॥ జిల్లా**

 

ది.31-10-03 కాశీలో తారకరామ నిలయం పేరుతో నిర్మించిన నిత్యఅన్నదాన సత్రమును ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు

## రమణ క్షేత్రం ప్రచురణలు

1. రమణ భాస్కర బైండులు 98-99 50/-
2. రమణ భాస్కర బైండులు 99-200050/-
3. రమణ భాస్కర బైండులు 2000-0150/-
4. రమణ భాస్కర బైండులు 01-02 50/-
5. రమణ భాస్కర బైండులు 02-03 50/-
6. వినీలాకాశంలో వింతకాంతి 15/-
7. అమృత వాక్కులు 20/-
8. The Art of the Holy Hill 20/-
9. శ్రీ రమణ కేంద్రం 5/-
10. ప్రస్థానత్రయం 12/-
11. దైవ సంపద 10/-
12. జ్ఞాన కిరణాలు 6/-
13. సద్గురు శ్రీ నాన్నగారు 5/-
14. రమణ ప్రసాదం 2/-
15. అక్షరమణమాల 4/-
16. వాశిష్ఠ రమణీయం 2/-
17. సత్యాన్వేషణ - సత్యదర్శనం 5/-
18. శ్రీ నాన్న ప్రవచనాలు 20/-
19. శ్రీ రమణ మహిమలు 2/-

## రమణాశ్రమ ప్రచురణలు

1. శ్రీ రమణ భాషణములు 80/-
2. శ్రీ రమణ లేఖలు 110/-
3. నీ సహజ స్థితిలో ఉండు 50/-
4. శ్రీ మహర్షి 20/-
5. నేనెవడను 2/-
6. రమణ స్మరణామృతం 20/-
7. శ్రీ రమణ మహర్షి ఉపదేశం 20/-
8. శ్రీ రమణ అనుగ్రహ తరంగాలు 40/-
9. అరుణాచల మహత్యం 40/-
10. శ్రీ రమణ కధాసుధ 10/-
11. శ్రీ రమణ కథామణిమాల 15/-
12. రమణ ఉపదేశామృతం 20/-
13. The Teaching of Sri Ramana 200/-
14. రమణ తాత 3/-
15. అనుగ్రహ తరంగాలు 30/-
16. భగవాన్ స్మృతులు 45/-
17. వాశిష్ఠ రమణీయం 2/-